# 16. పోలాల అమావాస్య కథ

ఒక యూరిలో ఏడుగురు అన్నదమ్ములుండిరి. వారికందరకు పెండ్లి అయి భార్యలు కాపురమునకు వచ్చిరి. కొంతకాలమునకా యేడుగురు తోటికోడండ్రు పోలాలమావాస్య నోమునోముకొనవలెనని ప్రయత్నము చేసిరి. కాని ఆ యమావాస్యనాడు ఆఖరి ఆమెకు బిడ్డ చనిపోవుటచే వారందరు నోమును నోచుకొనలేదు ఆ విధముగా వారు ఆరు సంవత్సరములు నోము నోచుటకు ప్రయత్నము జేయుటయు, ఆమె బిడ్డ చచ్చుటయు, నందుచే వారందరు నా నోమును నోచుకొనుటకు వీలు లేకపోవుట, మిగిలిన ఆరుగురు ఏడవయామెను దుమ్మెత్తిపోయుటయు జరుగుచుండెను. అట్లే ఏడవయేటకూడ వారందరు నోము ప్రయత్నముజేసిరి, పూర్వము వలెనే ఆఖరియామెబిడ్డ చనిపోయెను. కాని ఆమె తనను తిట్టి పోయుదురని భయపడి, చచ్చిన బిడ్డను యింటిలో పెట్టి తాళమువేసి మిగిలిన తోటికోడండ్ర యిండ్లకు వెళ్ళి నవారితోకలసి నోమును నోచుకొని రాత్రికి యింటికి వచ్చెను. పిమ్మట తెల్లామె చచ్చినబిడ్డ శవమును భుజముమీద వేసుకొని వూరిచివరనున్న పోలేరమ్మ గుడి దగ్గరకు తీసుకొనిపోయి యేడ్చు చుండెను. అంతలో గ్రామసంచారమునకు బయలుదేరిన పోలేరమ్మ ఆమెనుచూచి "యెందుల కేడ్చుచున్నావు?" అని అడిగెను. అందుకామె "అమ్మా! ఏడ్వకేమి చేయమన్నావు? ఏడేండ్లనుంచి యేటికొక పిల్లచొప్పున నేను పోలేరమ్మకు అప్పగించుచున్నాను. ఈ బిడ్డ నేటి యుదయమున చనిపోయెను. కాని ప్రతియేటా నాపిల్లలు పోవుటచే నా తోటికోడండ్రు నోమునాపుకొని, నన్ను తిట్టుట జరుగుచుండుటచేత యీ యేడు నేను వారి నోమునాపుట కిష్టపడక చచ్చిన బిడ్డను యింటిలో దాచి, వారితో నోము నోచుకొని యిప్పుడు శవమును తీసుకొని వచ్చితిని" అనెను. ఆ మాటలు విని పోలేరమ్మ జాలినంది. ఆమెకు అక్షతలనిచ్చి, వాటిని ఆమె బిడ్డలను పూడ్చినచోట చల్లి పేర్లతో చదివి పిలువ వలసినదిగా చెప్పి వెడలిపోయెను. ఆమె అమ్మవారు చెప్పినట్లే

తన పిల్లలను పాతినగోతులమీద అక్షతలను చల్లి చచ్చినవారిని పిలవగా-ఆ పిల్లలందరు సజీవులై వెలుపలకు వచ్చిరి. అంతట నామె ఆ యేడుగురు పిల్లలను వెంటబెట్టుకొని యింటికి వెళ్ళెను. తెల్లవారువరికి ఆమె తోటికోడళ్లు వూరివారు ఆ పిల్లలనుచూచి "వీరెక్కడనుండి వచ్చిరి?" అని అడుగగా—నామె గతరాత్రి జరిగిన విషయములను చెప్పెను. ఆ మాటలకందరు నాశ్చర్యపడి, ప్రతి సంవత్సరము పోలాల అమావాస్యనాడు నోమును నోచుకొనుచు సుఖముగా నుండిరి.

దీనికి వుద్యాపనము లేదు. ఇది అందరు చేయవచ్చును. యీ నోమును నోచుటవలన సంతానము లేనివారికి సంతతి కలుగును. సంతతి యున్న వారికి కడుపు చలువ కలుగును.